క్లుప్తంగా

'యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం'

కామేపల్లి: రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మల్లెంపాటి శ్రీనివాసరావు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తుగా పంటలు సాగు చేసిన వరి చిరుపొట్టదశలో ఉందని, యూరియా లేక పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై ఆరా

తిరుమలాయపాలెం: మండలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై శనివారం నేషనల్ హైవేస్ అధికారులు, మండల ఎస్ఐ కూచిపూడి జగదీష్ ఆధ్వర్యాన ప్రమాద ప్రాంతాలను పరిశీలించారు. ఈనేపథ్యాన తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ సమీపాన ప్రమాదాలు జరగకుండా అదనపు రంబుల్ స్ట్రిప్‌లు, సోలార్ బ్లింకర్లు, బ్లాక్‌స్పాట్ సైన్ బోర్డును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు.

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ, 58వ డివిజన్లలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సుతో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం నగర మేయర్ పునుకొల్లు నీరజ, పాలనాధికారి శ్రీనివాసరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఇన్‌చార్జ్ శెట్టి రంగారావు, నాంపల్లి శంకరయ్య, బిక్కసాని చారి, కందుల శంకర్, బత్తుల శ్రీను, చెరుకూరి సత్యనారాయణ, ఉష పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలు కొనసాగింపు

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో అమలులో ఉన్న కోడ్ ముగిసింది. దీంతో ఇప్పటి వరకు ఆగిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు దిశగా దృష్టి సారించారు. అందులో భాగంగానే మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొత్త పనులను మంజూరు చేస్తూ అభివృద్ధి పనులను కొనసాగించడం, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు ఇతరత్రా పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

పశు వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న చైర్మన్ హరినాథ్‌బాబు

తిరుమలాయపాలెం: మండలంలోని మేడిదపల్లి గ్రామంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ, పశు సంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యాన శనివారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి ప్రారంభించగా.. మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామీణ అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని పేర్కొని మందులు అందజేశారు. అనంతరం పశువుల వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహార సలహాలు, సంరక్షణపై సుబ్లేడు పశువైద్యాధికారి షేక్ జానీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ వీరాంజనేయులు, డాక్టర్ భవిత తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రఘునాథపాలెం: మండలంలోని ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై శనివారం వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు 9 మంది ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, ఇన్సూరెన్స్ లేకుండా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకోకుండా ప్రమాదాలకు కారణమవుతున్న ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కేసు నమోదు

రఘునాథపాలెం: భూమి కొనుగోలు వ్యవహారంలో మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని వీవీ పాలెం గ్రామానికి చెందిన డి.పావని గత జూలై 24న అదే గ్రామానికి చెందిన రాంబాబుకు రూ.9.60 లక్షలు చెల్లించి, భూమి కొనుగోలు చేసింది. అయినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.



అయ్యప్ప స్వామికి పూజలు..



ఆధ్యాత్మికం.. ఆరోగ్యం..

అయ్యప్ప మాలధారణకు పెరుగుతున్న ఆదరణ

- 41 రోజుల పాటు నియమనిష్టలతో దీక్ష
- ఈ ఏడాది ముందుగానే ప్రారంభమైన దీక్షలు
- అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతున్న ఆలయాలు

సండే స్పెషల్



పూజలో పాల్గొన్న మాలధారణ భక్తులు

నేలకొండపల్లి: ఏటా కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్ప దీక్షలు కొనసాగుతుంటాయి. అయితే ఆధ్యాత్మిక భావన పెంపొందించుట కోసం ఏటేటా అయ్యప్ప మాలధారణ భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. నియమనిష్టలతో మాలలు ధరించి భక్తిశ్రద్ధలతో 41 రోజుల పాటు భగవంతుని దీక్షలో గడుపుతారు. ఆధ్మాత్మిక దీక్ష.. ఆరోగ్యానికి రక్ష అని వైద్య నిపుణులు సైతం పేర్కొంటుండడంతో ఏటేటా ఆదరణ పెరుగుతూ వస్తోంది. కాగా, జిల్లాలోని ఖమ్మం, వైరా, సత్తుపల్లి, భద్రాచలం, నేలకొండపల్లి తదితర ప్రాంతాల్లో దాతల సహాయంతో నిత్యాన్నదానం అందిస్తున్నారు.

ప్రయోజనాలు..

సాంకేతిక యుగంలో ప్రజలు అనేక ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొంటుండగా.. మానసిక, శారీరక ప్రశాంత కోసం ఆధ్యాత్మిక మార్గాలను ఎంచుకుంటున్నారు. వైద్యులు సైతం ఈ మార్గం అనుసరనీయమని చెబుతుండడంతో ఆదరణ పెరుగుతోంది. మాలధారణ భక్తులు వేకువజాము న నిద్ర లేవడం, చన్నీళ్లతో తలంటి స్నానం చేయ డం, పాదరక్షలు లేకుండా కాలినడకన ఆలయానికి వెళ్లి పూజలు చేయడం వంటివి ఓ రకమైన వ్యాయామాలు అయితే నల్లటి వస్త్రాలు ఉష్ణాన్ని గ్రహించడం, ఉపవాసాలు శరీర ఉష్ణోగ్రతను సమంగా ఉంచడం వంటివి అన్నీ ఆరోగ్య హేతువులే. నుదుటి మీద విభూది, గంధం, చందనాల్లో ఏదో ఒకదానిని ధరించటం వల్ల నాడీ మండలానికి కేంద్రమైన నుదుటి భాగం ఒత్తిడి నుంచి ఉపశమనం కల్గిస్తుంది.

ఆదరణ ప్రాంతాలు..

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో అయ్యప్ప ఆలయాలు, హరిహర క్షేత్రాలు నిత్యం మాలధారణ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఖమ్మం, వైరా, భద్రాచలం, కొత్తగూడెం తదితర పట్టణాల్లో మాలధారణలు ఎక్కువగా ఉంటుండగా.. సూర్యాపేట జిల్లా కోదాడ అనంతగిరిలో అయ్యప్ప దేవాలయాల వద్ద కూడా పెద్దఎత్తున భక్తులు మాలధారణ స్వీకరిస్తారు. అయితే ఈ ఏడాది భక్తులు ముందుగానే మాలధారణ ధరించడంతో ఆలయాల్లో స్వామియే శరణం అయ్యప్ప అంటూ చేస్తున్న నామస్మరణల శరణుఘోష వినిపిస్తోంది.

24 ఏళ్లుగా మాల వేస్తున్నా..



గత 24 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ వేస్తున్నా. స్థానిక వాసవి భవన్‌లో పీఠం ప్రారంభం నుంచి మాల ధరిస్తున్నా. ఏటేటా మాలధారణ భక్తులు పెరుగుతున్నారు. భక్తి భావంతో నాకు శక్తి ఉన్నంత వరకు మాల వేస్తునే ఉంటా. కఠినమైన నియమాలతో పూజలు చేయాలి.

– పావులూరి వెంకటేశ్వరరావు, నేలకొండపల్లి

సంతృప్తినిస్తుంది..



ప్రతీ మనిషి జీవితంలో ఒక్కసారైనా మాల వేయాలి. భక్తి మార్గం ఎంతో సంతృప్తినిస్తుంది. దైవ చింతనలో గడపడం ఆధ్మాత్మిక భావాలతో ఉండటం వల్ల మంచి అలవాట్లు వస్తాయి. సమాజంలో గౌరవం లభిస్తుంది. స్వామియే శరణమయ్యప్ప నామం నాలో బలాన్ని, సంతోషాన్ని నింపుతుంది.

– రావెళ్ల కృష్ణారావు, మోటాపురం

సత్ప్రవర్తన పెంపొందుతుంది..



అయ్యప్ప మాలధారణ దీక్ష ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యానికి ఉపకరిస్తుంది. 41 రోజుల పాటు భగవంతుని దీక్షలో గడుపుతాం. ఉదయాన్నే చన్నీళ్ల స్నానం, పాదరక్షణలు లేకుండా నడవడం, అయ్యప్ప జపం చేయడం వలన భక్తితో పాటు మానసికోల్లాసం, సత్ప్రవర్తన పెంపొందిస్తుంది.

– ఏపూరి హరిప్రసాద్, చెరువుమాధారం

అన్నదానానికి రూ.25 వేల వితరణ



విరాళం అందిస్తున్న పృథ్వీ

ఖమ్మం అర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయ సన్నిధిలో మాలధారులకు ఒకరోజు అన్నదాన నిమిత్తం హైకోర్టు న్యాయవాది మల్లెంపాటి పృథ్వీ రూ.25 వేల విరాళాన్ని అందించారు. శనివారం దేవాలయ చైర్మన్ కోమరయ్యకు కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి ఆధ్వర్యాన అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సీజేఐపై దాడికి నిరసన



ధర్నాలో పాల్గొన్న వీరభద్రం, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడి చేసి అవమానించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన నేత గుంతేటి వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అంబేద్కర్ ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఖమ్మం జెడ్పీసెంటర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పోలీస్ వ్యవస్థ న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లింగాల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కే.వీ.కృష్ణారావు, న్యాయవాది బిచ్చల తిరుమలరావు, తెలంగాణ ఉద్యమకారుడు విజయ్, బానోత్ కిషన్ నాయక్, బీసీ నేతలు పెల్లూరి విజయ్ కుమార్, కత్తి నెహ్రూ, మైనార్టీ నేత ఖాసీం, న్యాయవాదులు మేకల సుగుణరావు, పాముల దానయ్య, చిర్రా రవి, మర్రి ప్రకాష్, పమ్మి రవి, నాగేశ్వరరావు, సత్యం, ప్రభాకర్, శ్రీనివాస్, వెంకటరమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఖమ్మం మామిళ్లగూడెం: అక్టోబర్ 1న ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మంలో సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యాన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీఎస్పీ కేదాసు నరసయ్యతో పాటు రాయల వెంకటేశ్వర్లు, ఆకుల గణపతిరావు, భూపాల్ రెడ్డి, వాసుదేవరెడ్డి, కె.కృష్ణమూర్తి, పరిశ పుల్లయ్య, సరోజినీబాయి, రామ్మోహన్‌రావు, రామలింగారెడ్డి, రచ్చ రామారావులను సన్మానించారు. సీనియర్ సిటిజెన్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీరామ్ గోపాల్‌రెడ్డి, సైబర్ క్రైం డిపార్ట్‌మెంట్ సురేష్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ విజయలక్ష్మి, సోమిరెడ్డి, దామోదర్, సీనియర్ సిటిజెన్ ఆర్గనైజేషన్ వైస్ చైర్మన్ మూలగుండ్ల శ్రీహరి, జనరల్ సెక్రటరీ సాదినేని జనార్దన్‌రావు, సెక్రటరీ జి.సూర్యప్రకాష్‌రావు, గౌరవ గౌరవ సలహాదారు గోవర్ధనరావు, జల్ల వెంకటేశ్వర్లు, గజేంద్ర నాగేశ్వ రావు, తాత రాఘవయ్య, కుటుంబరావుతో పాటు కొత్త సత్యనారాయణరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


జరిమానా..

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిధిలోని దుకాణాలను శనివారం కార్పొరేషన్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించిన మొత్తం 8 దుకాణాలకు రూ.45 వేల జరిమానా విధించి 5 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, జవాన్లు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి నివాళి

కూసుమంచి: మండలంలోని మునిగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రామా శ్రీను తల్లి రామా కళావతి ఇటీవల మృతిచెందారు. ఈమేరకు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారి స్వగృహానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి కళావతి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సుందర్‌రావును సత్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నట్లు బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బెఫీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నున్నా సుందర్‌రావు తెలిపారు. శనివారం నగరంలోని గాంధీచౌక్ డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ అభివృద్ధికి ఉద్యోగులు తోడ్పాటునందించాలని తెలిపారు. సంఘం అధ్యక్షుడు జె.అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షులు ఉమ్మినేని కోటయ్య, ప్రస్తుత పాలకవర్గ సభ్యులు పి.రాంబ్రహ్మం, జనగం కోటేశ్వరరావులతో పాటు మంగపతి, సుబ్రమణ్యం, రవీందర్, మధు, వెంకటేశ్వరరావు, నాదం, ఎంపీ చౌదరి, మోహన్‌రావు, ప్రభాకర్, ఉమామహేశ్వరరావు, హంజా, శ్రీవాణి కవిత, రవి, రాంబాబు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'చాంబర్' దిగుమతి శాఖ సమావేశం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి శాఖ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక వర్తక సంఘ భవనం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలంలు మాట్లాడుతూ..ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధారంగా ఏర్పటైన చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీల కాల పరిమితి ముగుస్తున్న క్రమంలో త్వరలో వివిధ శాఖలకు ఎన్నికలు ఉంటాయన్నారు. దిగుమతి శాఖ అధ్యక్షుడు దిరిశాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ముత్యం ఉప్పల్‌రావు, కార్యదర్శి నివేదికను వినిపించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు జీ.వై.నరేష్, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు త్వరగా పూర్తి చేయాలి



ముజ్జుగూడెంలో పంట నమోదు చేస్తున్న ఏఓ

నేలకొండపల్లి: పంటల నమోదు కార్యక్రమాన్ని సత్వరమే పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ ఆదేశించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. మండలంలోని మొత్తం 28 వేల ఎకరాల పంటల నమోదులో ఇప్పటి వరకు 26 వేల ఎకరాల నమోదు చేసినట్లు తెలిపారు. పత్తికి కనీస మద్దతు ధర కోసం మండలంలోని 4వేల ఎకరాల్లోని పత్తి రైతులు కపాస్ కాటన్ యాప్‌లో పంట నమోదు చేసుకోవాలని చెప్పి అవగాహన కల్పించారు. వరిలో వస్తున్న ఎండు ఆకు తెగుళ్ల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఈఓలు ఈశ్వరి, శిరీష, దుర్గాభవాని, అవినాష్, అరవింద్ పాల్గొన్నారు.

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌కు చెందిన యలమందల వెంకన్న సాగర్ కాల్వలో గల్లంతయ్యాడు. టేకులపల్లి సాగర్ వంతెన వద్ద స్నానం కోసమని కాల్వలోకి దిగిన ఆయన వరద ఉధృతిలో గల్లంతైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఈమేరకు అందిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్,పువ్వాళ్ల తదితరులు

ఖమ్మంఅర్బన్: దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన 'ఓటు చోరీ సంతకాల సేకరణ'కార్యక్రమానికి ప్రజా ఉద్యమ రూపం దాల్చాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ–అమిత్ షా నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా, దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆదివారం నాటికి ఖమ్మం నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్, ప్రతీ పంచాయతీ పరిధిలో బూతుకు 200 చొప్పున ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు జరిపిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, రాష్ట్ర విత్తన గిడ్డంగి కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలతో పాటు మానుకొండ రాధాకిషోర్, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహార్, కార్పొరేటర్లు మురళీ, కరుణసైదబాబు, వెంకటేశ్వర్లు, సైదులు, నీరజ, శరత్, దిరిశాల వెంకటేశ్వర్లు, వాంకుడోత్ దీపక్, తుపాకుల యలగొండస్వామి, రావూరి సైదబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

వేంకటేశ్వర స్వామికి పుష్పయాగం



పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్ శ్రీ స్తంభాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి 61వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి శ్రీపుష్పయాగోత్సవాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొండకింది వేణుగోపాలచార్యులు, ప్రధాన అర్చకులు శేషభట్టర్ రఘునాధాచార్యులు, మధుసూదనాచార్యులు, కేశవాచార్యులు, నగర ఐరన్ హార్డ్‌వేర్, స్టీల్ మర్చెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

హిందుత్వమే భారత్ ఆత్మ

ఖమ్మం మామిళ్లగూడెం: హిందుత్వమే భారతదేశపు ఆత్మ అని, ధర్మరక్షణే మన కర్తవ్య మార్గమని సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ ఉద్ఘాటించారు. శనివారం తాంద్ర మంజుల సేవా ట్రస్ట్ ఏర్పాటై 17వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో తాంద్ర రాంప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్ దేశ్ పాండేలతో పాటు బొమ్మ రాజేశ్వరరావు, కేశవ, వాసు తదితరులు పాల్గొన్నారు.

రమణగుట్టలో పర్ణశాలల పండుగ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని రమణగుట్ట యావె సమాజ మందిరంలో శనివారం పర్ణశాలల పండుగ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పాలడుగు రత్నపాల్ ఏసుక్రీస్తు పుట్టుక, పర్ణశాలల మహోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, గీతాలను ఆలపించారు. సువార్త సహకారులు, సంఘ పెద్దలు మోదుగు మోసే, బాసిపొంగు ప్రసాద్, అంబజి ఐజక్, కె.డేవిడ్, వంగూరి ఏలియా, యోసేపు, జితేందర్, మోదుగు హోనుకు, సునీత, ఉమారాణి, రూతు, స్వరూప, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కాస్మోటిక్ చార్జీలు వెంటనే చెల్లించాలి

తిరుమలాయపాలెం: గత ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని జల్లేపల్లి స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి గాదె వరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు కాస్మోటిక్ చార్జీలు రావట్లేదని పేర్కొన్నారు. అంతేకాక పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రాథమిక విద్యపై దృష్టి సారించి పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

నిధులు కేటాయించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం త్రీ టౌన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం త్రీటౌన్ 29వ డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రీటౌన్ ప్రాంతంతో రోడ్లు వెడల్పు లేక షాపింగ్‌మాల్స్, దుకాణాలు ఏర్పడడం లేదన్నారు.ఖమ్మం రైల్వే గేట్ కింద అండర్ పాస్, పీఎస్ఆర్ రోడ్డు వెడల్పు చేసి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం ఖమ్మం డివిజన్ నాయకులు షేక్ హిమామ్, నాయకులు హనుమంత చారి, శ్రీను, చంద్రశేఖర్, రవీందర్, రాము, పుష్పావతి, సుభద్ర, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేద్దాం




మాట్లాడుతున్న న్యాయవాది నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులు రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది జక్కంపూడి నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నాగటి నారాయణ తృతీయ వర్ధంతి సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పీఠికను చదివించి రాజ్యాంగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో కార్యకర్తగా ప్రారంభమై ఉపాధ్యాయ ఉద్యమానికి విశిష్ట సేవలు అందించిన నారాయణ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.రంజాన్ అధ్యక్షతన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, కుటుంబ సంక్షేమ నిధి రాష్ట్ర కార్యదర్శి జీ.వీ. నాగమల్లేశ్వరరావు, పెన్షనర్స్ నాయకులు నాగేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులను కాపాడుకుందాం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల హక్కులను కాపాడడంలో ఐద్వా కార్యకర్తలు ముందుండాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి అన్నారు. ఐద్వా ఖమ్మం డివిజన్ నాలుగో మహాసభ ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో పత్తిపాక నాగసులోచన, షేక్ మెహరున్నిసాబేగం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, లైంగిక దాడులు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐద్వా నూతన కమిటీ ఎన్నుకోగా.. ఖమ్మం డివిజన్ అధ్యక్షురాలిగా బాగం అజిత, కార్యదర్శిగా పత్తిపాక నాగ సులోచన ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి.పద్మ, ఎం.రమణ, కత్తుల అమరావతి, గుడిమెట్ల రజిత, ఫరీదా, అమీనా, బీబీ, రమ, నాగమణి, పద్మ, పావని, కుమారి, మంగ తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్'.. బోధనలో ఎవరెస్ట్



హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్



హార్వెస్ట్ పాఠశాల

ఖమ్మం సహకారనగర్: మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ.. నాణ్యమైన విద్యను బోధించి ఎవరెస్ట్ అంతా ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది నగరంలోని హార్వెస్ట్ విద్యాసంస్థలు. ఆటపాటలతో పాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 2002–03వ విద్యా సంవత్సరంలో సువిశాల ప్రాంగణం, అత్యాధునిక వసతులతో పాటు సొంత క్యాంపస్‌లో తరగతులను ఏర్పాటు చేసింది. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్స్(స్టేట్, సీబీఎస్ఈ), ఐఐటీ, నీట్, ఫౌండేషన్ తరగతులతో పాటు ప్రత్యేక కో కరిక్యులర్ యాక్టివిటీస్‌లో భాగంగా చెస్, యోగా, కరాటే, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, బాస్కెట్ బాల్, అబాకస్ తదితర వాటిలో ప్రత్యేక శిక్షణ ఇప్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

సంప్రదాయాలపై దృష్టి..

విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే దేశ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా పండుగలను నిర్వహిస్తుంది. హార్వెస్ట్‌కు అనుబంధంగా 2009–10లో టెండర్ రూట్స్, 2021–22లో గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం స్ప్రింగ్ లీఫ్, 2024–25లో అంతర్జాతీయ స్థాయిలో విద్యనందించాలనే ఉద్దేశంతో సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేశాయి. 2015–16లో సీబీఎస్ఈ విద్యార్థుల కోసం ప్లస్–2, స్టేట్ విద్యార్థుల కోసం జూనియర్ కళాశాలను ప్రారంభించారు.

సరికొత్తగా..

ఈ విద్యా సంవత్సరం (2025–26)లో సరికొత్త కళాశాల భవనం (సెంట్రల్ ఏసీ) సకల సౌకర్యాలతో ఆధునిక లేబరేటరీలు, లైబ్రరీలతో ప్రారంభించినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. గత దశాబ్దకాలంగా ఎంతో మంది విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్ఐటీల్లో, వైద్య విద్య కళాశాలల్లో సీట్లు సాధించి హార్వెస్ట్ కీర్తిని మరింత పెంపొందించేలా కృషి చేస్తుండగా... విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, సిబ్బంది సహకారం బాగుందన్నారు.